క్లుప్తంగా

రోహిణికార్తె ప్రభావాన్ని చూపిన భానుడు

సామర్లకోట: రోహిణి కార్తె ప్రారంభం రోజునే గురువారం భానుడు తన ప్రభావాన్ని చూపాడు. ఉదయం ఏడు గంటల నుంచి వేడి గాలి వీయడం ప్రారంభించింది. దాంతో రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. ఎండ వేడికి తట్టుకోలేక చిరు వ్యాపారులు దుకాణాలు మూసివేసి ఇళ్లకే పరిమితమయ్యారు. 15 రోజులు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని పెద్దలు హెచ్చరిస్తున్నారు.

వ్యక్తి నుంచి స్వర్ణాభరణాల స్వాధీనం


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్సై లోవరాజు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విలువైన బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన విల్లూరి శివసాయి ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడు. అతని నుంచి 24 గ్రాముల బంగారు నల్ల పూసల గొలుసు, 32 గ్రాముల తాలిబొట్టు, రెండు సెల్ ఫోన్లు లభించాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని విజయవాడ కోర్టుకు హాజరు పరచి అనంతరం రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల అధికారి టి.నళినీప్రియ అన్నారు. ఉప్పాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గురువారం క్రాఫ్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇక్కడ ప్రతి రోజూ సుమారు 40 మంది విద్యార్థులు శిక్షణకు వస్తున్నారని తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. వచ్చే నెల 11వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ, అమీనాబాద్, యండపల్లి, నాగులపల్లి చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

నేడు సామాజిక తనిఖీ

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 నిమిషాలకు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

కౌలు రైతులు సాగు హక్కు పత్రాలు పొందాలి

కొతపల్లి: ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందాలంటే కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు అన్నారు. మూలపేట, కొత్తమూలపేట, పొన్నాడలోని ఉన్న రైతుభరోసా కేంద్రాల వద్ద కౌలు రైతులకు గురువారం సాగు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 1,460 మంది రైతులకు సాగు హక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు


విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సాయిరామకృష్ణ

సామర్లకోట: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఆయా హైస్కూళ్లలో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. జూన్ 2 నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. వీటిలో పాస్ అయిన విద్యార్థులు విద్యా సంవత్సరం వృథా కాకుండా ఇంటర్‌లో చేరే అవకాశం ఉంటుంది. దాంతో ఆయా హైస్కూళ్లలో జరుగుతున్న అదనపు తరగతులకు విద్యార్థులు హాజరవుతున్నారు. ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు విద్యార్థుల స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్నారు.

కౌలు రైతుకు పట్టాభిషేకం


సామర్లకోట మండలంలో సాగు హక్కు కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

- సాగు హక్కు పత్రాలతో ఎంతో మేలు
- ప్రతి ఆర్బీకేలో అవగాహన సదస్సులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు భరోసా

సామర్లకోట: కౌలు రైతులకు ఇస్తున్న సాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు ఎంతో మేలు జరగనుంది. ఈ మేరకు రైతులు, కౌలు రైతులలో అవగాహన పెరగడానికి ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సాగు హక్కు పత్రాలను అందజేస్తున్నారు. మండల పరిధిలో 3,398 మంది కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ కార్డు ఉన్న కౌలు రైతులకు బ్యాంకులు ఎకరానికి రూ.40 వేలు నుంచి రూ.90 వేల వరకు పంట రుణాలను అందజేస్తారు. పంట నమోదు కూడా కౌలు రైతు పేరున నమోదు చేయడంతో పంటను విక్రయించుకునే హక్కు కౌలు రైతుకు ఉంటుంది. పంట నష్టం జరిగిన సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా సదుపాయం కూడా కౌలు రైతుకే దక్కుతుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.13,500 ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే కౌలు రైతులతో పాటు భూ యజమానికి కూడా భరోసా అంద జేస్తున్నారు. సాగు హక్కు పత్రాలు కేవలం 11 నెలల మాత్రమే పని చేస్తాయి. దీంతో భూ యజమానికి ఎటువంటి భయమూ ఉండదు. అలాగే ప్రతి ఏటా కౌలు రైతు సాగు హక్కు పత్రాలను పొందాలి.

ఎంతో మేలు



సాగు హక్కు పత్రాలతో కౌలు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పత్రాల ద్వారా సాగుకు అవసరమైన రుణాన్ని బ్యాంకు నుంచి తీసుకోవచ్చు. గతంలో బయట వ్యక్తుల నుంచి అప్పు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం పావలా వడ్డీపై రుణాలు అందజేయడంతో సాగుకు భరోసా లభిస్తోంది.

– వెలమర్తి శ్రీనివాస్, కౌలు రైతు, వీకే రాయపురం

అర్హులందరికీ సాగు హక్కు కార్డులు



కౌలు చేసుకునే రైతులందరికీ సాగు హక్కు కార్డులను అందజేస్తున్నాం. ప్రసుత్తం 3,398 కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం. రైతులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించడానికి సదస్సులు నిర్వహిస్తున్నాం, రెవెన్యూ శాఖ సహకారంతో కార్డుల పంపిణీ జరుగుతోంది.

– ఐ.సత్య, ఏఓ, సామర్లకోట

ప్రతి కౌలు రైతుకూ సీసీఆర్‌సీ తప్పనిసరి

ఏడీఏ దైవకుమార్


సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ దైవకుమార్

పెద్దాపురం: ప్రతి కౌలు రైతుకూ పంట సాగు హక్కు కార్డు (సీసీఆర్‌సీ) తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయ శాఖ పెద్దాపురం ఏడీఏ ఎస్.దైవకుమార్ అన్నారు. మండలంలోని మర్లావ ఆర్బీకే వద్ద గురువారం వ్యవసాయ సహాయకులు షేక్ బాలాజీ అధ్యక్షతన జరిగిన రైతు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రధానంగా కౌలు చేసే రైతులకు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు ఉండాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, ఎరువులు, పంటనష్టం, సబ్సిడీ వంటి వాటికి ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీసీఆర్‌సీ కార్డు కావాల్సిన రైతులు పొలం పాస్‌బుక్, రైతు ఆధార్, ఫోన్ నెంబర్, కౌలు రైతు ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లతో సంబంధిత కార్యాలయంలో అందజేసి సీసీఆర్‌సీ కార్డును పొందాలని ఏడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, వీఆర్వో కె.చక్ర సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం


ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- 22వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెద్దాపురం : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం పట్టణంలోని 12వ సచివాలయం పరిధిలో 22వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ, సచివాలయ సిబ్బందితో కలసి దవులూరి గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. మహిళాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్టపరమైన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీభాస్కరాచార్యులు

పిఠాపురం: బాల బాలికలతో వెట్టిచాకిరీ చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా కార్యదర్శి న్యాయవాది గుడిమెల్ల శ్రీభాస్కరాచార్యులు అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యాన పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మానవ అక్రమ రవాణా నేరమని, పిల్లలను ఒకచోటు నుంచి మరోచోటుకు తరలించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, వెట్టిచాకిరీ చేయించడం నేరమని తెలిపారు. పిల్లలతో కఠినమైన పనులు చేయించరాదన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో బాలల హక్కుల కమిషన్ పని చేస్తోందని, వీరి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కృషి చేయాలని అన్నారు. పోలీసు, కార్మిక శాఖ అధికారులు సమన్వయంతో వీధి బాలలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. పిల్లల రక్షణకు సంబంధించి పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, న్యాయవాది ఐఏ పాషా, ఎస్సైలు అబ్దుల్ నబీ, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: రమణక్కపేట – రామరాఘవపురం రోడ్డు సమీపంలోని తోటలో ఉన్న సారా బట్టీలపై సిబ్బందితో కలిసి ఎస్సై రామలింగేశ్వరరావు గురువారం దాడి చేశారు. సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రయాలు నేరమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఎవరైనా సారా తయారు చేస్తున్నా, విక్రయిస్తున్నా తమకు సమాచారం అందించాలని సూచించారు. సారా వ్యాపారులపై చర్యలు తప్పవని, అనుమతి లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రత ఎంతో అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత

సామర్లకోట: మహిళల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై మెప్మా రిసోర్సుపర్సన్లు అవగాహన పెంచాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అన్నారు. గురువారం స్థానిక మెప్మా కార్యాలయం పట్టణ పరిధిలోని ఆర్పీలకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. ప్రస్తుత సీజన్‌లో అతిసార వ్యాపించే అవకాశం ఉన్న కారణంగా తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రోజు పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ చెత్త సేకరణకు వస్తున్నారని, ఆ సమయంలో చెత్తను వారికి అందజేసే విధంగా ఆర్పీలు మహిళలకు అవగాహన పెంచాలన్నారు.

వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తుని రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ తుని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న రైతులకు 80 శాతం, ఎగువన ఉన్న రైతులకు 50 శాతం చొప్పున రాయితీ ఇస్తారన్నారు. మిగిలిన మొత్తాన్ని రైతులు భరించాలన్నారు. ఒకసారి ఈనిన, 2 నుంచి పదేళ్ల మధ్య ఆవులకు, 3 నుంచి 12 ఏళ్ల మధ్య గేదెలకు, ఏడాదిన్నర నుంచి పదేళ్ల లోపు వయస్సు ఉన్న ఎద్దులు, గిత్తలు, దున్నపోతులకు, ఆరు నెలలకు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు బీమా వర్తిస్తుందని వివరించారు. రేషన్ కార్డు కలిగిన ఒక్కో రైతు ఐదు వరకూ పశువులకు బీమా చేయించవచ్చని తెలిపారు. మేకలు, గొర్రెలు, పందులు 50 వరకూ ఉండవచ్చన్నారు. అంటువ్యాధులు, విద్యుత్ షాక్, వరదలు, తుపాన్లు, విష ప్రభావం, క్రూర జంతువుల దాడి, రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాల్లో పశువులు మృతి చెందితే రైతులకు బీమా పరిహారం లభిస్తుందన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న పాడిరైతు మూడేళ్లకు రూ.15 వేల పరిహారానికి రూ.480, రూ.30 వేల పరిహారానికి రూ.960 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పాడి రైతులు తమ వాటాగా రూ.15 వేలు పరిహారానికి రూ.192, రూ.30 వేల పరిహారానికి రూ.384 చొప్పున ప్రీమియం చెల్లించాలని తెలిపారు. మేకలు, గొర్రెలు, పందుల లబ్ధిదారు వాటాగా రూ.6 వేల పరిహారానికి ఏడాదికి 3 శాతం, రెండేళ్లకు 4.5 శాతం, మూడేళ్లకు 6.25 శాతం చొప్పున చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మండల వెటర్నరీ ఆస్పత్రిలో పశు వైద్యులను సంప్రదించాలని శ్రీధర్ సూచించారు.

టీడీపీ సమావేశం

కొత్తపల్లి: మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ గురువారం యండపల్లిలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోన జరిగే టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలి

గోకవరం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలని అటవీ శాఖ మల్లవరం సెక్షన్ అధికారి పి.వెంకట్రావు అన్నారు. మండలంలోని మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద, రైతుల పంట పొలాల వద్ద గ్రామస్తులకు, రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తీసుకోవాలని అన్నారు.

విజ్ఞాన సుమాలు వికసించేలా..

- సాంకేతిక రంగంలో సృజన పెంచేందుకు విద్యార్థులకు శిక్షణ
- కొత్త ఆలోచనలకు బాటలు వేస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు
- నిపుణుల ఆధ్వర్యాన ఇటీవల ప్రత్యేక శిక్షణ
- ఉపయోగించుకున్న 45 మంది చిన్నారులు


కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కిర్లంపూడి: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల్లో విజ్ఞాన సుమాలు వికసించేలా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వారు పట్టు సాధించేలా.. సృజనాత్మకతతో కొత్త ఆలోచనలకు బాటలు వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు వివిధ పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా.. పుణె నగరానికి చెందిన విజ్ఞానాశ్రమం, యునిసెఫ్, జాతీయ విద్య, పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), నీతి ఆయోగ్ సంస్థల సౌజన్యంతో ఇటీవల ఎంపిక చేసిన పాఠశాలల్లో సమ్మర్ బూట్ క్యాంపులు నిర్వహించారు. మన రాష్ట్రంలో కృష్ణా జిల్లా పెనమలూరు, తిరుపతి జిల్లా వరదయ్యపాళెం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి, విశాఖపట్నం జిల్లా వేపగుంట, పల్నాడు జిల్లా ఈపూరుతో పాటు కాకినాడ జిల్లా నుంచి కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఈ సమ్మర్ బూట్ క్యాంప్‌లకు ఎంపిక చేశారు. సైన్స్, గణితం సబ్జెక్టుల్లో నూతన ఆలోచనలను మరింతగా పెంపొందించేందుకు అత్యాధునిక సాంకేతికతతో ఇటీవల నాలుగు రోజుల పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పుణె విజ్ఞాన ఆశ్రమం నుంచి వచ్చిన నిపుణులు వెంకటేశ్, అవినాష్ ఈ శిక్షణ నిర్వహించారు. కిర్లంపూడిలోని కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి ప్రైవేటు పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. ఒక్కో ల్యాబ్‌ను సుమారు రూ.10 లక్షలతో నిర్మించారు. కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు 2022 ఏప్రిల్ 26న ప్రారంభించారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ ఎంపిక చేసిన 45 మంది విద్యార్థులకు వీడియో మేకింగ్ అండ్ డాక్యుమెంటేషన్, ఆర్ట్, త్రీడీ ప్రింటింగ్ అండ్ డిజైనింగ్, మెకానికల్ టూల్స్, బేసిక్ ఎలక్ట్రానిక్స్, రొబోటిక్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.


చీకటి పడితే ఆటోమెటిక్‌గా వెలిగే ల్యాంప్‌లు తయారు చేస్తున్న విద్యార్థులు

సాంకేతికతపై ఆసక్తి



ప్రస్తుతం అందరూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. జీవితంలో ఇది ఒక భాగంగా మారింది. టెక్నాలజీని నేర్చుకోవడానికి విద్యార్థులు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు.

– ఆకుల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ పాఠశాల, కిర్లంపూడి

రొబోటిక్ సైన్స్‌పై..



మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల చదువుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. సమాజానికి ఉపయోగపడే సమస్యలను వెలికి తీసేందుకు మైక్రో కంట్రోలర్ కోడింగ్ ద్వారా రొబోటిక్ సైన్స్ నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

– మునుకుట్ల కల్యాణ్ చక్రవర్తి, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జి, కిర్లంపూడి పాఠశాల

త్రీడీ ప్రింటింగ్‌లో రాణిస్తా..



త్రీడీ ప్రింటింగ్ నాకు చాలా ఇష్టమైన సబ్జెక్ట్. తక్కువ ఖర్చుతోనే ఇళ్లు నిర్మించుకునేందుకు సులభమైన మార్గం త్రీడీ ప్రింటింగ్. ఇందులో మరింత శిక్షణ పొంది రాణిస్తా.

– షేక్ అబ్దుల్ షారుక్, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కిర్లంపూడి

వీడియో ఎడిటింగ్ ఇష్టం



మొదటి నుంచీ వీడియో ఎడిటింగ్‌పై ఆసక్తి ఎక్కువ. దీనిపై అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ఇచ్చిన శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. ల్యాబ్‌లో మరిన్ని విషయాలు తెలుసుకున్నా. దీనిపై ఎక్కువ దృష్టి పెట్టి మరింత పట్టు సాధిస్తా.

– బి.కావేరి, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కిర్లంపూడి

ఫిల్టర్‌బెడ్ పరిశీలన


వడగొట్టబడిన నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

సామర్లకోట: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ గురువారం ఫిల్టర్ బెడ్ ప్లాంటు, నాగార్జున ఫిల్టర్ ప్లాంటు చెరువును పరిశీలించారు. చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండడంతో నీరు ఆకుపచ్చరంగులో ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు క్లోరిన్, ఆలమ్‌లను నీటిలో కలపాలని సూచించారు. ప్లాంటులో నీరు ఫిల్టర్ అవుతున్న విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ ఏఈ వి.భాస్కర అరవింద నాగ సాయికుమార్, సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులు, ఫిల్టర్ బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమపై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న అచ్చారావు

పెద్దాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చేనేత సంఘం నాయకుడు గొల్ల అచ్చారావు విద్యార్థులకు చేనేత పరిశ్రమపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన ఈ శిక్షణ ఇచ్చారు. అనంతరం చేనేత రంగంలోని పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.